

ఉద్యోగులను మోసగిస్తే ప్రభుత్వానికి కాలం చెల్లినట్లే

సిపిఎస్ సబ్ కమిటీ జిల్లా కోకన్వీనర్ భవానిప్రసాద్

భీమవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగిస్తే ప్రభుత్వానికి కాలం చెల్లినట్లేనని, అవసరమైతే చరిత్రను గుర్తు చేసుకోవచ్చని సిపిఎస్ సబ్ కమిటీ జిల్లా కోకన్వీనర్ భవానిప్రసాద్ అన్నారు. ఐజిఎన్ఒయు హైదరాబాద్ రీజనల్ సెంటర్‌లో జరుగుతున్న ఇన్ సర్వీస్ బిఇడి వర్క్‌షాప్‌లో పాల్గొంటున్న సిపిఎస్ జిల్లా సబ్‌కమిటీ కోకన్వీనర్ భవానీ ప్రసాద్ నిరవధిక నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు తెలంగాణ ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయాన్ని అంగీకరించే ప్రసక్తి లేదన్నారు. జిపిఎస్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఒపిఎస్ ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్‌బాబు, మహేంద్ర, చైతన్య, రామకృష్ణ, శ్రావణ దీప్తి, ఖాదర్‌బి పాల్గొన్నారు.


చి'వరి' కష్టాలు..!

సాగునీరందక రైతుల అవస్థలు

డ్రెయిన్లలో నీటిని తోడి పంటను రక్షించుకునేందుకు యత్నం

నీరందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం

పట్టించుకోని అధికార యంత్రాంగం, ప్రభుత్వం



ఆచంట వేమవరంలో నీరు లేక ఎండుతున్న పంట పొలాలు

ప్రజాశక్తి - ఆచంట

డెల్టాలో రోజురోజుకీ సాగునీటి ఎద్దడి తీవ్రతరమవుతోంది. కాల్వల ద్వారా నీరు సక్రమంగా అందకపోవడం, మండుతున్న ఎండలు రైతన్నలను బేజారెత్తిస్తున్నాయి. ఆచంట, పోడూరు తదితర మండలాల్లో పరిస్థితి రోజురోజుకీ దిగజారుతూ పంటపొలాలు బీటలు వారుతున్నాయి. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షల్లో మునిగి తేలుతున్న అధికారులకు సాగునీటి సమస్య పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలో ఆచంట వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, కరుగోరుమిల్లి, శేషమ్మచెరువు, పెదమల్లం, కోడేరు తదితర గ్రామాల్లోని శివారు ప్రాంత ఆయకట్టు భూములు నీరందక ఎండిపోతున్నాయి. దీనికి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా సార్వా సీజన్‌లో ఈ భూములు ముంపుబారిన పడేవి. ఈ ఏడాది దీనికి భిన్నంగా ప్రస్తుతం నీరు లేక ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామంటూ గత ఎన్నికల సాక్షిగా నేతలు హామీలిచ్చారు. దొంగరావిపాలెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తామనే హామీ ప్రకటనలకే పరిమితమైంది. దీంతో ప్రతియేటా దాళ్వా సీజన్‌లో సాగునీటి ఎద్దడి తప్పేది కాదు. ఈసారి ఏకంగా సార్వా సీజన్‌లోనే నీటిఎద్దడి ఏర్పడటంతో ఇక సాగు వదిలేయాల్సిందేనా అని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దొంగరావిపాలెం వద్ద వశిష్ట గోదావరి నుంచి కోడేరు బ్యాంక్ కెనాల్ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే అది సాకారం కాకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆయకట్టుకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, చివరి దశలో నీటి ఎద్దడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు పంట కాలువలను ప్రక్షాళన చేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందనేది వాస్తవం. మండలంలో బ్యాంక్ కెనాల్, దేవ కాలువ, జగ్గరాజు కాలువ, కొఠాలపర్రు, కాలువ కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక ఎండిపోయే దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల రైతులు డ్రెయిన్లలో నీటిని మోటారు ఇంజిన్ల ద్వారా పొలాల్లోకి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో 10,152 ఎకరాల్లో సార్వా సాగు చేయగా సుమారు మూడు వేలకుపైగా ఎకరాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. వరి పొలాలన్నీ చిరుపొట్ట దశలో ఉండగా వర్షాభావం కారణంగా నీరందక దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

పంట కాల్వల ప్రక్షాళన చేపట్టాలి

కాండ్రేగుల హరిబాబు, కౌలురైతు, ఆచంట వేమవరం



శివారు ప్రాంతాలకు అధికారులు పూర్తిస్థాయిలో సాగునీరు పుష్కలంగా అందించాలి. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ ఆయకట్టుకు దేవ జగ్గరాజు కాలువ నుంచి సరఫరా అవుతోంది. ప్రభుత్వం కాల్వల ఆధునికీకరణ చేపట్టకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. తక్షణమే అధికారులు చొరవ తీసుకుని సాగునీరందించడంతోపాటు పంట కాలువల ప్రక్షాళన చేపట్టాలి.

కాల్వల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నాం

మల్లవరపు ఈశ్వరరావు, ఆచంట వేమవరం



ఆచంట వేమవరంలో పంట కాలువలు, బోదుల్లోని చెత్తా చెదారాన్ని తొలగించి నీరు పొలాలకు చేరేలా ప్రయత్నిస్తున్నాం. అధికారులు పంట కాలువల్లో ఈ ఏడాది కలుపు మందు కొట్టలేదు. దీంతో పంట కాలువల్లో చెత్తాచెదారం విపరీతంగా పెరిగిపోయి శివారు భూములకు సాగునీరు అందడం లేదు.

సాగునీరు పుష్కలంగా అందించాలి

వీరమల్లు వీర్రాజు, కౌలురైతు, ఆచంట వేమవరం



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. పంట పొలాలకు సాగు నీరందక అనేక ఇబ్బందులు పడుతున్నాం. దేవ కాలువ కింద రెండేళ్ల ఏళ్ల క్రితం తవ్వారు. ఇంత వరకూ పంట కాలువలో చెత్తాచెదారం తొలగించడంగాని, కలుపు మందు పిచికారీ చేయడంగానీ అధికారులు చేపట్టలేదు. గతంలో గంటాగలాసులు ఉండేవారు. వారు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తుండేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో పంట కాలువల పరిస్థితి దిగజారింది. తక్షణమే అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించి రైతులను కాపాడాలి.



దీక్షలు ప్రారంభిస్తున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

ఒపిఎస్ అమలు చేసే వరకు ఉద్యమం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

భీమవరంలో యుటిఎఫ్ నిరవధిక నిరసన దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్షలు గురువారం చేపట్టారు. ఈ దీక్షలను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ప్రారంభించి మాట్లాడారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని.. భిక్ష కాదని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తు చేశారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని అప్పటి సిఎం చంద్రబాబు ఠక్కర్ కమిషన్ తీసుకొచ్చి అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న నాటి ప్రతిపక్ష నేత హోదాలో జగన్ ఇచ్చిన హామీని సిఎంకాగానే మర్చిపోయారని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేయకుండా జిపిఎస్ తీసుకొచ్చారన్నారు. దీనిలో కంట్రిబ్యూషన్ ఉందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం జరగదని తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్ చత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ నుంచి ఒపిఎస్ వైపు అడుగులు వేస్తున్నాయని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేయమని అడుగుతుంటే ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తుందని, నిర్బంధంతో ఉద్యమాలను అణచివేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. ఒపిఎస్‌ను అమలు చేసే వరకూ ఉద్యమాన్ని కొనసాగించడంతోపాటు అవసరమైతే తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.రామకృష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శులు సాయిరామ్, జి.రామకృష్ణంరాజు, భీమవరం మండల ప్రధాన కార్యదర్శి బి.నాగబాబు కూర్చుని నిరసన తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్, జనవిజ్ఞాన వేదిక, ఎపి సిపిఎస్ఇఎ జిల్లా నేతలు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

భీమవరం ఆర్‌డిఒగా శ్రీనివాసులురాజు

ఉయ్యూరు ఆర్‌డిఒగా దాసి రాజు బదిలీ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఆర్‌డిఒగా కె.శ్రీనివాసులురాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్‌డిఒగా పని చేసిన దాసి రాజు కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్‌డిఒగా బదిలీ అయ్యారు. జిల్లాల పునర్విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం డివిజన్ కేంద్రంగాను గుర్తింపు పొందింది. భీమవరం మొట్టమొదటి ఆర్‌డిఒగా దాసి రాజు బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో ఆర్‌డిఒ దాసి రాజు కీలకపాత్ర పోషించి అందరి మన్ననలు పొందారు. అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు, సామాన్య ప్రజానీకానికి సైతం తలలో నాలుకలా ఉంటూ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. భీమవరం ఆర్‌డిఒగా శ్రీనివాసులురాజు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

నరసాపురం ఆర్‌డిఒగా అచ్యుత్ అంబరిష్

పాలకొల్లు: నరసాపురం ఆర్‌డిఒగా అచ్యుత్ అంబరిష్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. నరసాపురం ఆర్‌డిఒ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఎం.సూర్యతేజ ఏలూరు జిల్లాలోని కెఆర్‌పురం ఐటిడిఎ పిఒగా నియమితులైనప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా డిఆర్ఒ కృష్ణవేణి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం నరసాపురం ఆర్‌డిఒగా అచ్యుత్ అంబరిష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఎండిన వరి దుబ్బులను పరిశీలించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నిమ్మలచే బీటలువారిన పొలాల పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వద్దిపర్రులోని నీరందక ఎండిపోయి బీడువారుతున్న వరి పొలాలను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంట కాలవల్లో పూడిక తీయకపోవడం, సిల్టు తీయకపోవడం కారణంగా కాలువల నుంచి నీరు ప్రవహించక పొలాలకు నీరందని దుస్థితి ఏర్పడిందన్నారు. వేల క్యూసెక్కుల నీటిని వృథాగా గోదావరిలోకి వదిలేస్తూ పొలాలకు చుక్కనీరు అందకుండా చేస్తున్న ఈ ప్రభుత్వం రైతులను పూర్తిస్థాయిలో దగా చేస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ సార్వాసాగు రైతులు నష్టపోక తప్పదని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎండుతున్న వరి పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, సర్పంచి వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపిటిసి విప్పర్తి శారద, మాజీ ఎంపిపి పెన్మెత్స రామభద్రరాజు, శీలం వాసు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలో బంధనవారిమెరకలో రూ.25 లక్షలలు సిఎండిఎఫ్ నిధులతో నిర్మించిన ఒహెచ్ఆర్‌ను ఆయన ప్రారంభించారు. రూ.30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజలకు శుద్ధిజలాలు అందించేందుకు రూ.42 లక్షలతో పైపులైన్ల ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనంతరం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరానికి వచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరికీ వైద్యం అందించే బాధ్యత పూర్తిగా ప్రభుత్వం తీసుకుందన్నారు. ముత్యాలపల్లి హైస్కూలును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాబ్జి, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కె.సీతామహాలక్ష్మి, సర్పంచి కొప్పనాతి పల్లయ్య, ఎంపిటిసి తిరుమాని స్వామి, డిసిసిబి డైరెక్టర్ బంధాన పూర్ణచంద్రరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, ప్రజాప్రతినిధులు రేవు రాంబాబు, బర్రె స్వామి, కొప్పనాతి స్వామి, బొక్కా వెంకటేశ్వర్లు, కొల్లాటి రామారావు, పొన్నమండ సూరయ్య, దొంగ కృష్ణ, కడలి మధుసూదన్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి జగనన్న చేదోడు దోహదం : కలెక్టర్

నాలుగో విడత సాయం జమ

ప్రజాశక్తి - భీమవరం



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి జగనన్న చేదోడు ఎంతో దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వరుసగా నాలుగో విడత జగనన్న చేదోడు సాయాన్ని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి ముఖ్యమంత్రి జగన్ గురువారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పేదలు అధిక వడ్డీల బారిన పడకుండా ఆర్థికంగా వారు ఎదగాలనే ఉద్దేశంతో కుల వృత్తి చేసుకునే దుకాణాలు కలిగిన రజక, నాయీబ్రాహ్మణ, టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సంవత్సరానికి రూ.10 వేల చొప్పున వరుసగా నాలుగు ఏళ్లు రూ.40 వేలు జగనన్న చేదోడు ద్వారా అందించారన్నారు. ప్రస్తుతం 9698 మందికి రూ.9 కోట్ల 69 లక్షల 80 వేలు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని తరగతుల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు మాన్యువల్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, బిసి కార్పొరేషన్ ఎఇ కె.ప్రమీలరాణి, టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోపిల్ల రామకోటేశ్వరరావు, ఎపి రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.గోగురాజు, ఎపి తూర్పుకాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మల్లు వీరరాఘవమ్మ, టైలర్స్ అసోసియేషన్ టౌన్ సెక్రటరీ కె.త్రినాథ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ వి.సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ, కార్పొరేషన్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్




రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో సొమ్ము జమ చేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై అవగాహన, శిక్షణా సదస్సు నిర్వహించారు. కస్టోడియన్ అధికారులు, రైస్‌మిల్లర్లు ప్రతినిధులతో సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం కొనుగోలు మరింత సులభతరం చేసేందుకు జిల్లాలో 314 రైతుభరోసా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. దశలవారీగా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. ధాన్యం కొనుగోలుపై అవగాహన, శిక్షణ కొరవడితే సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇప్పటికే డివిజన్, మండలాలవారీగా అధికారులు, కస్టోడియన్ అధికారులు, ఆర్‌బికె, టెక్నికల్ సిబ్బంది, హెల్పర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. కొనుగోలుకు సంబంధించి తేమశాతం, టోకెన్ల జారీ, నాణ్యతా ప్రమాణాలు తదితర వాటిపై ప్రతిఒక్క సిబ్బందితో ప్రాక్టికల్‌గా చేయించామన్నారు. రైతులతో స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. జిల్లాలో 3,900 వాహనాలు అవసరమవుతాయని గుర్తించామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఒకే మిల్లుకు ఒకేసారి ఎక్కువ ధాన్యం పంపకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, కస్టోడియన్ అధికారులు, రైస్‌మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.కోట్లతో భీమవరం పట్టణాభివృద్ధి

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ గ్రంధి శ్రీనివాస్

కోట్లాది రూపాయలు వెచ్చించి భీమవరం పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం పట్టణం త్రీటౌన్‌లో రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.పది లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గ్రంధి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, ప్రస్తుతం మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని అన్నారు. పట్టణంలో పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా వారు సూచించిన మేరకు రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పట్టణాధ్యక్షులు తోట భోగయ్య, చెల్లబోయిన సూర్యప్రకాష్, వేండ్ర విజయదుర్గ, చెల్లంకి గిరి, అల్లూరి రాజేష్, నాగవల్లి, కందిగట్ల ఎడ్వర్డ్, భలే ఏసుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

వెంపలో ప్రజాబ్యాలెట్ - పరిమళ్ల, విప్పర్రులో నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్



భీమవరం రూరల్: వెంపలో ప్రజాబ్యాలెట్

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం వెంప బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు పెంపుపై ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. మొత్తం 190 ఓట్లు పోలవ్వగా విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా 181 ఓట్లు పోలవ్వగా, అనుకూలంగా తొమ్మిది ఓట్లు పోలయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ భారాలపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో ఈ ప్రజాబ్యాలెట్ తీర్పు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి విద్యుత్ భారాలను ఉపసంహరించాలన్నారు. కార్యక్రమంలో వేగి ప్రసాద్, నాగులు పాల్గొన్నారు.



పెంటపాడు: నినదిస్తున్న నేతలు, ప్రజలు

పెంటపాడు: విద్యుత్ భారాలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని పరిమళ్ల, విప్పర్రు గ్రామ సచివాలయాల వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ఆదేశాలకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలొగ్గి విద్యుత్ భారాలు మోపుతోందని విమర్శించారు. శ్లాబ్‌లు మార్చేయడం వల్ల మరింత భారం పడిందన్నారు. భారాలు ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పనసల సత్యనారాయణ, ఎండ పెద్దిరాజు, యండ్రపు కృష్ణ, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, పెనగంటి దుర్గ, తిరుమల గంగరాజు, మద్దాల పుత్రయ్య, తాడి సుబ్బయ్య, మాదాసు శ్రీను, మద్దాల మహంకాళి, కవల సోమరాజు, గిద్ద శివ, కుర్రెల రాజు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఎత్తివేయొద్దు

సిపిఎం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

కరెంటు బిల్లుల చెల్లింపు కేంద్రాలు కొనసాగించాలని సిపిఎం పట్టణ కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజుకు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ బిల్లులు మీసేవ, ఫోన్‌పే ద్వారా చెల్లించాలని చెప్పడం సరైంది కాదని మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ అన్నారు. మీసేవ ద్వారా చెల్లింపుల వల్ల సర్వీస్ ఛార్జీ పేదలకు అదనపు భారమేనన్నారు. కేంద్రాలు ఎత్తివేసే ఆలోచన విరమించుకోవాలన్నారు. ట్రూఅప్ ఛార్జీలు తదితర పన్నుల పేరుతో వేస్తున్న భారాలు తగ్గించాలని కోరారు. విద్యుత్ భారాలు తగ్గించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చల్లా సోమేశ్వరరావు, ఎస్.పురుషోత్తం, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

హేమకు గ్రామస్తుల సత్కారం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన వడ్లపాటి హేమశ్రీ ఇటీవల నిర్వహించిన గ్రూప్-4లో జూనియర్ కంప్యూటర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు హేమశ్రీని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపిటిసి సభ్యులు విప్పర్తి శారద చిట్టిబాబు, వడ్లపాటి సురేష్, చోడగిరి పెద్దిరాజు, వడ్లపాటి సుధాకర్, ఉండ్రు మాణిక్యాలరావు, వడ్లపాటి రంగ పాల్గొన్నారు.

మతోన్మాదంతో ముంచుతున్న బిజెపి

ప్రజాశక్తి - ఆకివీడు

బిజెపి హిందూ మతోన్మాదాన్ని ముందుకు తీసుకొచ్చి ప్రజల మధ్య విభేదాలు తీసుకురావాలని చూస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. పార్టీ మండల కార్యాలయంలో గురువారం విస్తృతస్థాయి జిల్లా కార్యకర్తల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులను గోపాలన్ ప్రారంభించి మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకులు బొక్క సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రారంభ సమావేశానికి పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, ఉండి మండల కార్యదర్శి ధనికొండ శ్రీను, కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ వేదికను అలంకరించారు. జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పలు పథకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైసిపికే దక్కుతుందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గురువారం ప్రారంభించారు. తొలుత గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. హరిజనపేటలో రూ.11 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఆర్గానిక్ పద్ధతిలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందేందుకు ఆర్గానిక్ పద్ధతి ప్రోత్సహించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థలో గోదావరి జిల్లాల సుస్థిర వరి వ్యవసాయానికి ప్రణాళిక శిక్షణ, అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ రైతులు భవిష్యత్తులో స్వల్పకాలిక, అధిక దిగుబడులు పొందేందుకు వీలుగా పంటలు పండించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కోరమాండల్ జోనల్ మేనేజర్ ఎం.సత్యానందరెడ్డి, శాస్త్రవేత్త టి.శ్రీనివాస్, విజయవాడ కోరమండల్ డివిజనల్ అగ్రగామి ఎం.మోహన్‌కుమార్, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త ఆర్గనైజర్ డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జగన్‌ను మరోసారి సిఎంగా గెలిపించాలి'

ప్రజాశక్తి - కాళ్ల


కాళ్ల: ఏలూరుపాడులో పివిఎల్

పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సిఎం జగన్‌ను మరోసారి సిఎంగా గెలిపించాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడు సచివాలయ-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరం : ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఏడాది జనవరి నెల నుంచి పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచడానికి సిఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మడుగు పోలవరం పంచాయతీ జొన్నలపాలెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, తహాశీల్దార్ ఎం.సుందర్‌రాజు, ఎంపిడిఒ జ్యోతి, పంచాయతీరాజ్ డిఇ స్వామినాయుడు, సర్పంచి బోణం పరమేశ్వరరావు, మానుకొండ ప్రదీప్ పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో కౌలు రైతుసంఘం శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమవరం

నవంబరు 2, 3 తేదీల్లో కౌలు రైతుల సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సుబ్బరాజు, ఎం.రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరంలోని గౌతు లచ్చన్న ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌలురైతుల సమస్యలు, నూతన వ్యవసాయ పద్ధతులపై రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహించనున్నామన్నారు. ఈ తరగతులను కొంతమంది ప్రొఫెసర్స్, సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బోధిస్తారన్నానరు. ఈ శిక్షణా తరగతులకు రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు జిల్లాలోని కౌలురైతుల సంఘం జిల్లా, మండల, గ్రామ కమిటీ సభ్యులు, కౌలు రైతులంతా హాజరు కానున్నట్లు తెలిపారు.

శశి విద్యార్థులకు రక్త వర్గీకరణ పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జాతీయ సేవా పథకంలో భాగంగా శశి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు గురువారం ఏలూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్త వర్గీకరణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రక్తదానం ఆవశ్యకత, ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు తమ రక్త వర్గీకరణ పరీక్షలు చేయించుకున్నారని కో-ఆర్డినేటర్ సల్మాన్‌బాషా తెలిపారు.

నేడు పాలకోడేరులో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నూకల మురళీగంగాధరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి తో పాటు జిల్లాస్థాయి అధికారులంతా అందుబాటులో ఉంటారని తెలిపారు.

సూర్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత జిల్లా రక్తదాన కమిటీ కన్వీనర్, మండల పూర్వ కార్యదర్శి వారధి రమణరావు తండ్రి వారధి సూర్యనారాయణ(72) ఇటీవల మృతి చెందారు. మానవత ఆత్మీయ సహకార కమిటీ గురువారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాప సభలో మానవత వైస్ ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, అధ్యక్షులు శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షులు కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సంబరం

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం కనకదుర్గమ్మ ఆలయంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో దసరా బోనాల సంబరం గురువారం ఘనంగా నిర్వహించారు. 150 మంది మహిళలు ప్రత్యేక అలంకరణలో భవాని మాలధారణలతో నెత్తిన బోనాలు పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరమణ, యలమంచిలి రామాంజనేయులు, గుర్రం వెంకట సత్యనారాయణ, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ, యలమంచిలి గణపతి పాల్గొన్నారు.

ఘనంగా దసరా విజయీభావ శోభాయాత్ర

భీమవరం రూరల్ : దసరా వేడుకల్లో విజయీభావ శోభాయాత్ర నిర్వహించడం అభినందనీయమని ఆర్‌టిసి బస్టాండ్ సిఐ ఆంజనేయులు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా విజయీభావ శోభాయాత్రలో భాగంగా గురువారం ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో నిర్వహించారు. యూనియన్ నాయకులు కడలి హరిబాబు, పంపన గోపీ, వాసు మాట్లాడుతూ విజయీభావ శోభాయాత్ర నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజం కోసం ఆధ్యాత్మిక భావంతో మెలగాలని, అందులో భాగమే విజయీభావ శోభాయాత్ర అని అన్నారు.

అభివృద్ధికి చిరునామాగా కట్టుపాలెం

రూ.2 కోట్లతో పలు పనులు
గ్రామాభివృద్ధే ధ్యేయం : సర్పంచి నాగరాజు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

ప్రజాశక్తి - యలమంచిలి

అభివృద్ధి పథంలో పయనిస్తున్న మండలంలోని కట్టుపాలెం పంచాయితీ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ గ్రామం అనేక ఏళ్లుగా అభివృద్ధిలో అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండే పొన్నమండ నాగరాజును గ్రామస్తులంతా కలిసి సర్పంచిగా ఎన్నుకున్నారు. నాగరాజు కూడా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ గ్రామంలో ఏపే పనులకు నిధులు రాబట్టాలో ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. గతంలో వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జిగా, జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న కవురుశ్రీనివాస్‌తో, ప్రస్తుత ఇన్‌ఛార్జిగా ఉన్న గుడాల శ్రీహరి గోపీ తో మంచి సత్సంబంధాలు కలిగి ఉండడంతో గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్యను తీర్చేలా జల జీవన్ మిషన్ ద్వారా రూ.40 లక్షల నిధులతో నూతన పైపులైను వేయడమే కాకుండా చాలావరకు ఇంటింటికి కులాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. నడవడానికి కూడా అసౌకర్యంగా ఉన్న స్థానిక అగ్నికుల క్షత్రియుల కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని జెడ్‌పి నిధులు రూ.20 లక్షలతో విశాలవంతమైన సీసీ రహదారిగా నిర్మించారు. అదే కాలనీకి జెడ్‌పి నిధులు రూ.ఐదు లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో డ్రెయినేజీ నిర్మించారు. ఎప్పటినుంచో అభివృద్ధికి నోచని స్థానిక ఎస్‌సి కమ్యూనిటీ హాలు ఆధునీకరణకు జెడ్‌పి నిధులు రూ.పది లక్షలతో పనులు చేస్తున్నారు. మండల పరిషత్ నిధులు రూ.2.5 లక్షలతో బుడగజంగాల కమ్యూనిటీ హాలు ఆధునికీకరణకు కృషి చేశారు. స్థానిక వినాయకుడి ఆలయం వద్ద ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ నిధుల రూ.3.5 లక్షలతో నూతనంగా కల్వర్టును నిర్మించారు. మరో రూ.4 లక్షల నిధులతో పంచాయతీ వెనుక ఉన్న పల్లపు ప్రాంతాన్ని మెరక చేయించి అందుబాటులోకి తెచ్చారు. దీంతోపాటు నూతన సచివాలయ భవనానికి వెళ్లే రహదారిని రూ.2 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీ ఎదురుగా ప్రజల కోరిక మేరకు రూ.2.5 లక్షలతో కల్వర్టును కూడా పూర్తి చేశారు. అన్నిటికంటే ప్రధానంగా గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా గ్రామ నడి బొడ్డున రూ.40 లక్షల నిధులతో నూతన సచివాలయ భవనం, మరొక రూ.40 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనం, ఆర్‌బికె కేంద్రాలను త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.లక్షల నిధులతో స్థానికంగా ఉన్న మంచినీటి చెరువులో పూడికతీత పనులు చేయించి అందుబాటులోకి తేవడంతో పలువురు గ్రామస్తులు సర్పంచి పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.


అగ్నికుల క్షత్రియుల కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

మరిన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది
సర్పంచి పొన్నమండ నాగరాజు



గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాల్సి ఉంది. మంచినీటి సమస్యను పూర్తిగా తీర్చే విధంగా జల జీవన్ మిషన్ ద్వారా మరో రూ.40 లక్షల నిధులతో పనులు చేయగలిగితే ప్రజలందరికీ తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ప్రధానంగా అన్ని వర్గాలకు సంబంధించిన శ్మశానానికి వెళ్లే రహదారిని నిర్మించాల్సి ఉంది. అగ్నికుల క్షత్రియుల కమ్యూనిటీ హాలు భవనం, నక్కల కాలువ వద్ద రేవు నిర్మాణం, ఎన్‌టిఆర్ కాలనీలో డ్రెయినేజీ, వినాయకుడి ఆలయ సమీపంలో డ్రెయినేజీ నిర్మాణాలు, గ్రామంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల మార్పునకు కృషి చేస్తున్నాను.

ఘనంగా మంత్రి కొట్టు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు ఆయన నివాసం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్, కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, వెలిశెట్టి నరేంద్ర కుమార్, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణంలోని ఎనిమిదో వార్డుకు చెందిన సంకు శివ ప్రదీప్ ఎంసిఎ అభ్యసించేందుకు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు నిమ్మకాయల గోపాలరావు, నీలిమ గురువారం అందించారు. రామ్మోహన్ నాయుడు స్నేహితుడు బండారు విశ్వమోహన్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

పాఠశాలకు సిమెంట్ బెంచ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలకు పాలకొల్లు జెసిఐ రైసింగ్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సిమెంట్ బెంచిని బహుకరించారు. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కావలి మౌని, కారుమూరి సబిత, రేపాక మీనా మణిదీప్తి, అనూష పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ క్లబ్ సభ్యులను అభినందించారు.

గ్రంథాలయంలో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. గ్రేడ్ వన్ లైబ్రరియన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పెనుమంట్ర : మార్టేరు శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా ఐదో రోజు గురువారం మ్యూజికల్ ఛైర్ నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పిటి.శివకుమార్ అన్నారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు.

రీ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మూడో విడత రీ సర్వే పనులను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, రీ సర్వే, తదితర అంశాలపై సిసిఎల్‌ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. నవంబర్ నెలాఖరు నాటికి సర్వే రాళ్లు వస్తాయని, వాటిని డిసెంబర్ నాటికి పాతి రైతులకు సరిహద్దులను చూపించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే అధికారి జాషువా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జిల్లా రిజిస్ట్రారు, సబ్ రిజిస్ట్రార్లులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రారు ఆర్.సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్లు జి.శివయ్య, పి.వెంకటేశ్వరరావు, ఎం.భూషణం, పి.రుక్మిణి పాల్గొన్నారు.

భీమవరంలో ఫస్ట్ క్రై షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం


షోరూంను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి

భీమవరం పీపీ రోడ్డులో ఫస్ట్ క్రై షోరూం ఏర్పాటైంది. ఆంధ్ర తెలంగాణలోని మొట్టమొదటి అతిపెద్ద షోరూం కావడం విశేషం. ఈ ఫస్ట్ క్రై షోరూంను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. చిన్నపిల్లల కోసం ప్రత్యేకించి ఫస్ట్ క్రై డాట్ కామ్ షోరూమ్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం నిర్వాహకులు తాడికొండ అవినాష్ తాడికొండ జయశ్రీ మాట్లాడుతూ తమ షోరూమ్‌లో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వరకు అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అక్రమ రవాణా నిర్మూలనకు 139

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశ వ్యాప్తంగా సామాజిక రుగ్మతగా పరిగణిస్తున్న మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రజలందరికీ సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రైల్వే పోలీస్ ఫోర్స్ ద్వారా ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని రైల్వే అడిషనల్ డివిజనల్ ఇంజినీర్ అందే రామాంజనేయులు అన్నారు. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలన అంశంపై గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ రైల్వే ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి


పెనుమంట్రలో...


వీరవాసరంలో...

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు హైస్కూల్ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్నిప, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, గ్రామ అధ్యక్షులు కలిదిండి దినేష్‌రాజు, ఎంపిటిసి సభ్యులు పెచ్చెట్టి నరసింహమూర్తి, గ్రామ నాయకులు వడ్లమూడి ప్రదీప్ కుమార్, కొలుకులూరి సతీష్, కుసుమే సురేష్ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని సగం చెరువు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సగంచెరువు సర్పంచి నాగమణి, గోరింటాడ సర్పంచి పావని కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోడూరు : అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ అన్నారు. మండ లంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, గుంటూరి చంటిరాజు, సర్పంచి మురళీరాజు, బాలాజీ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మండలంలోని మల్లవరం, మల్లవరం లంక గ్రామాలకు సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు గురువారం మల్లవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మల్లవరం సచివాలయం వద్ద రూ:5 లక్షలతో అభివృద్ధి పరిచిన ఫిల్టర్ బెడ్‌ను ప్రారంభించారు.

వీరవాసరం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. మండలంలోని తోకలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన సభలో బాబు మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను బాబు, సర్పంచి వీరవల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా అందించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ పట్ల బాబు సంతృప్తి వ్యక్తం చేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, కోడి అప్పారావు, ఎంపిడిఒ జ్యోతి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో కక్షపూరిత, అరాచక పాలన'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో సిఎం జగన్ కక్షపూరితమైన, అరాచక రాజకీయాలు చేస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆచంటలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 37వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలను ఉద్దేశించి పితాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నేతలు కేతా మీరయ్య, గొడవర్తి శ్రీరాములు, నరసింహమూర్తి ప్రసాద్, సత్యనారాయణ, చిలుకూరి శ్రీను, మన్నే తేజ భాస్కరరావు, మురళి, సీతారాం, రాజేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాళ్ల : టిడిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో ఎంఎల్‌ఎ రామరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి రాంబాబు, బాబుతో నేను కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు మినీ మేనిఫెస్టోలోని పథకాల వివరాల ఉన్న కరపత్రాలను, అక్రమ అరెస్టు నేపథ్య వివరాలు ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, కఠారి నరసింహరాజు, వేగశ్న మురళీకృష్ణంరాజు, కాలువ వెంకట్రావు, గండి నందిరాజు, పుప్పాల బుజ్జి, తోట ఫణిబాబు, మంతెన రామరాజు, సర్పంచులు మంతెన శ్రీనివాసరాజు, గేదల జాన్, మాజీ సర్పంచి వేణుగోపాలరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


కాళ్ల : పెదఅమిరంలో బాబుతో నేను కార్యక్రమం

వీరవాసరం : చంద్రబాబు అరెస్ట్ అన్యాయమని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని ఆవేదన వ్యక్తం చేశారు. బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా గురువారం నవుడూరు సెంటర్‌లో గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్, జనసేన ఎంపిటిసి సభ్యులు యాల బండి ఇందిర, టిడిపి మండలాధ్యక్ష కార్యదర్శులు కొల్లేపల్లి శ్రీనివాసరావు, వీరవెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లు పట్టణ తాపీ పని వర్కర్స్ యూనియన్ సారథ్యంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం 37వ రోజు కొనసాగాయి. దీక్షలను ఉద్దేశించి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడారు.

మొగల్తూరు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో టిడిపి నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంబాబు, రేవు పాండు, రామారావు, కొల్లాటి పుల్లయ్య, సుందర సత్తిబాబు, కొల్లాటి సాయిబాబు, నాగేశ్వరరావు, పెంటయ్య పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - పాలకోడేరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ షేక్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు రూరల్, శృంగవృక్షం ఇండస్ట్రియల్ ఫీడర్లపై చెట్లకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంటుమిల్లి, శృంగవృక్షం, విస్సాకోడేరు విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.